

అల్లూరి సీతారామరాజు

అనారోగ్యంతో బాలింత మృతి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ గంగుడి గ్రామానికి చెందిన బాలింత సిదరి.అప్పలమ్మ మృతి చెందింది. బాలింత రెండో కాన్పులో బాబుని జన్మనిచ్చి రక్తం తక్కువ కావడంతో శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆమె మత్తితో కుటుంబమంతా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పట్టం పంచాయతీ లో వరుసగా గర్భిణీలు, బాలింతలు మరణాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు దృష్టి సారించి మరణాలకు అడ్డుకట్టు వేయాలని కుటుంబ సభ్యులకు కోరుతున్నారు.



అప్పలమ్మ మృతదేహం



ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్న స్థానికులు, పర్యాటకులు

ఉన్ని దుస్తులకు గిరాకీ

-పెరిగిన చలితో ఎగబడి కొనుగోలు చేసిన గిరిజనులు

ప్రజాశక్తి- అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయ ప్రాంతంలో రోజురోజుకు చలి తీవ్రత పెరిగి పోతుండడంతో ఉన్ని దుస్తులకు గిరాకి పెరిగింది. గతంలో ఎప్పుడు లేనంతగా జనవరి మాసంలో ఉష్ణోగ్రత తీవ్రంగా పడిపోతుండడంతో ఈ ప్రాంతంలో గిరిజనులు సతమతం అవుతున్నారు. చిన్నపిల్లల దగ్గర నుంచి పండు టాకుల వరకు గజగజ వణికి పోతున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ఉన్నిదుస్తులను ఆశ్రయిస్తున్నారు. వీరితోపాటు పర్యాటకులు కూడా ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి చలి తీవ్రతను తట్టుకోలేక పర్యాటకులు వెను తిరుగుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు అయినా చలి తీవ్రత తగ్గక పోవడంతో ఇబ్బందులు పడక తప్పడం లేదు. దీంతోపాటు కొద్దిసేపు ఎండ కాసినప్పటికీ మరల మూడు గంటల సమయం నుంచి చలిగాలులు మొదలు కావడంతో ఈ ప్రాంతంలో గజగజ వణికి పోతున్నారు. గత వారం రోజులుగా చలి తీవ్రత సింగల్ డిజిట్ కి పడి పోయింది. ఉష్ణోగ్రత పడిపోతున్న దృష్ట్యా రగ్గులు, స్వెటర్లు విక్రయదారులు అరకులోయ ప్రాంతంలో చేరుకొని ఊరూరా తిరిగి విక్రయిస్తున్నారు. దీంతోపాటు ఒరిస్సాకు చెందిన వ్యాపారులు అరకు లోయలో ఉన్ని దుస్తుల దుకాణాలు రోడ్ల విరువైపులా పెట్టడంతో స్థానికులు పర్యాటకులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఉన్ని దుస్తులకు మరింత గిరాకీ ఏర్పడింది.

పర్యాటకులు మాత్రం ఈ చలిని ఆస్వాదిస్తున్నారు. ఫిబ్రవరి నెల వరకు చలి పెరుగుతూనే ఉంటుందని కొంతమంది పెద్దలు అభిప్రాయపడుతున్నారు. చలి తీవ్రత అధికంగా ఉండడంతో పాటు, పొగ మంచు కప్పుకొని ఉండడంతో వాహన చోధకులు ప్రయాణించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. అరకు- విశాఖ ఘాట్ రోడ్‌లో మరింతగా ఉష్ణోగ్రత పడిపోవడంతో వాహనాలు నడపడానికి ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

పొగ మంచుతో ఇక్కట్లు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో గత వారం రోజుల నుంచి చలి తీవ్రత పెరిగింది. ఎముకలు కోరికే విధంగా చలి ఉంటుంది. రాత్రి నుంచి సుమారు ఉదయం 10 గంటల వరకు చలిమంచు వీడటం లేదు. దీంతో 10 గంటల సమయంలో కూడా వాహనదారులు లైట్లు వేసి పొగ మంచులో ప్రయాణం చేస్తున్నారు. ఉదయం 9 గంటలైనా చలిమంటలు వేసుకుని కాచుకుంటున్నారు. ఎముకలు కొరికి చలి తీవ్రతతో మండల గిరిజనులు బయటికి రావడానికి భయపడుతూ ఇంటికె పరిమితమవుతున్నారు. పెరిగిన చలి తీవ్రతకు స్థానికులు ఇబ్బంది పడుతున్నా మైదాన ప్రాంతం నుంచి తిలకించడానికి వచ్చిన సందర్శకులు మాత్రం చలిమంచును ఆస్వాదిస్తున్నారు.



రోడ్డుపై దట్టంగా కురుస్తున్న పొగ మంచు

ఐద్వా ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-చింతూరు :ఐద్వా, చింతూరు మండల కమిటీ ఆధ్వర్యంలో కల్లేరు, బురకనికోట గ్రామంలో శని, ఆదివారాల్లో మహిళకు ముగ్గులు, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, కబడ్డీ తదితర ఆటలు పోటీలు నిర్వహించారు. కల్లేరు గ్రామంలో సోడే చిన్నమ్మ, బుర్కాన్ కోటలో ఎంపిటిసి ముర్రం లక్ష్మి అధ్యక్షతన జరిగిన ముగ్గుల పోటీలకు ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ పద్మ, చింతూరు మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లం సుబ్బమ్మ, ముర్రం రంగమ్మ, మండల కమిటీ సభ్యులు కమలమ్మ ,చిన్నమ్మ, రాములమ్మ, పండ బుచ్చమ్మ, జోగమ్మ పాల్గొని పర్యవేక్షింఆచరు. ముగ్గులు పోటీలో మొదట బహుమతి పొడియం నవ్య, రెండో బహుమతి సోడే సరోజిని, బుర్కన్‌కోటలో మొదటి బహుమతి బేబీ, రెండో బహుమతి రోజా, మ్యూజికల్ చైర్‌లో కుర్చీలాటలో గంగాభవాని, రెండో బహుమతి నాగమణి, కబడ్డీ పోటీల్లో పాల్గొన్న 14 మంది మహిళలకు ఎంపిటిసి చిన్నమ్మ బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, హత్యలు, అత్యాచారాలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ పథకాల అమలు వాగ్దానాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, వాటి అమలులో మీనమేషాలు లెక్కించడం దారుణమన్నారు. వ్యాపార, రాజకీయ ప్రయోజనాలకు . మహిళలను వాడుకుంటున్నారని ఆక్షేపించారు. మహిళల క హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని కోరారు.



విజేతలకు బహుమతులిస్తున్న ఎంపిటిసి చిన్నమ్మ, ఐద్వా నేతలు

తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు



సమావేశంలో మాట్లాడుతున్న రాజులు

ప్రజాశక్తి- విఆర్.పురం:గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయనిసిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర సభ్యులు సున్నం రాజులు ధ్వజమెత్తారు. ఆదివారం సున్నం.దూలయ్య అధ్యక్షన సిపిఎం చిన్నమటపల్లి జోన్ సున్నంవారి గూడెం, కన్నాయిగూడెం, చిన్న మట్టపల్లి గ్రామ శాఖల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సున్నం. రాజుల్లు మాట్లాడుతూ చిన్నమట్టపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పైపులైన్లు పనిచేయక కొన్ని నెలల నుండి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు తెలియపరిచినా పట్టించు కోవట్లేదన్నారు. కన్నాయి గూడెం గ్రామంలోని విద్యుత్ సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వరదలు వచ్చి నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు విద్యుత్ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని, దీనిపై అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన లేదని మండిపడ్డారు. వేసవి రాకముందే గ్రామాల్లో తాగునీటి ఎద్దడిన నెలకొన్నా వాటి పరిష్కారానికి చొరవ చూపడం లేదని, ఇదే నిర్లక్ష్యం కొనసాగితే, మున్నుందు వేసవిలో మన్యవాసులు గొంతెండి ఇబ్బందులు పడక తప్పదన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తుగా పక్కా ప్రణాళిక, కార్యాచరణతో పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు విద్యుత్ సమస్య వెంటాడుతుండడంతో చుట్టూ దట్టమైన అడవుల మధ్యనున్న గ్రామాల్లోని అడవి పుత్రులు అటవీ జంతువులు విషకీటకాలు ఎటువైపు నుంచి వస్తాయోనని అంటున్నారు. గిరిజనులంటే చిన్నచూపు ఈనాటికీ పోలేదని, అందుకు నిదర్శనమే నేటికీ తాగునీరు, విద్యుత్ ఇతర మౌలిక సౌకర్యాలకు ప్రజలు అల్లాడుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా స్పందించకుంటే పెద్దఎత్తున ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, మండల నాయకులు పండా వెంకటేశ్వర్లు, కారం. సత్తిబాబు, మీడియం సీతయ్య, శాఖ కార్యదర్శి నరసయ్య, కార్యకర్తలు శాంతమ్మ, సోడి. రాజారావు పాల్గొన్నారు.

దళారుల చేతిలో గిరి రైతుల దగా

- గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యం కల్పనలో వైఫల్యం
- సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు పాయం సీతారామయ్య

ప్రజాశక్తి- కూనవరం : గిరిజనులు పండించిన పంటలు, సేకరించిన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక దళారుల చేతితో దగా, మోసానికి గురౌతున్నారని అసలు ధర తెలియక ముంపు ప్రాంత ప్రజలు నష్టపోతున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కూటూరు గ్రామంలో సోడె శ్రీరాములు అధ్యక్షతన సమావేశంలో మాట్లాడుతూ, గిరిజనులు పండించిన పంటలు అమ్ముకునే పరిస్థితి లేక నష్టపోతున్నా పట్టించుకోవడం లేదని,



మాట్లాడుతున్న సిపిఎం నేత సీతారామయ్య

అసలు ప్రభుత్వ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు ఉన్నాయా? లేవా? లేకుంటే గిరిజనులకు వాటి సేవలు ఇచ్చే అవసరం లేదాయని ప్రశ్నించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, రైతులు పండించిన ఏయే పంటలకు దిగుబడులు ఎలా వున్నాయి, వాటి ధరలు మార్కెట్లో ఎలా వున్నాయో రైతులకు తెలియజేయాలన్నారు.

గిరిరైతులు సాగుకు పెట్టుబడులు లేక అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగుచేస్తున్నారని, తీరా పంట చేతికి వచ్చిన తర్వాత గిట్టుబాటు ధర దక్కక తక్కువ ధరకు దళారులు, ప్రయివేటు వ్యాపారులకు ముట్టజెప్పి, నష్టపోయే పరిస్థితులు కల్పించడం దుర్మార్గమన్నారు. వరదలు, వర్షాలు వల్ల పంటలు పాడై ఒకవిధంగా నష్టం కలుగుతుంటే, ఇపుడు పంట చేతికి వచ్చాక మార్కెటింగ్, గిట్టుబాటు ధరలు లేక ఇలా నష్టపోవడం మాత్రం ప్రభుత్వం వైఫల్యం, నిర్లక్ష్యమేనని మండిపడ్డారు.

ఏజెన్సీ ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వం వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులను నియమించి, ప్రతి సచివాలయంలో పంటలు ధరలు సూచికలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేసారు. దళారుల వ్యవస్థను నిర్మూలించడంతోపాటు మార్కెటింగ్‌శాఖ, జిసిసి ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరారు. ముంపు ప్రాంతాల్లో గిరిజన రైతులకు ప్రభుత్వమే పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సోడె శ్రీరాములు పాయం శేఖర్ నూప రాజు,పద్దం రామచంద్రం, మిడియం రాము పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై పోరాటం

నేడు భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దగ్ధం
సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స పిలుపు

ప్రజాశక్తి పాడేరు: విద్యుత్ చార్జీలు పెంపును, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ప్రజలందరూ బోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి ఈనెల 13న నిరసన తెలపాలని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాట తప్పి రూ. 15,484కోట్ల సర్దుబాటు చార్జీల భారం ప్రజలపై వేశారని ఆయన విమర్శించారు. ఈనెల నుండి బిల్లులు పెంచారని, పాత మీటర్లు తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఈ మీటర్లు ముందు ప్రభుత్వ కార్యాలయాలలో పెట్టారని,. ఇప్పుడు షాపులు, సంస్థలలో బిగిస్తున్నారని. ఉచిత విద్యుత్ అంటూనే వ్యవసాయ పంపుసెట్లకు బిగించారని. త్వరలో అన్ని ఇళ్లకు బిగిస్తారని తెలిపారు. ఈ ప్రీ పెయిడ్ మీటర్లతో కరెంట్‌కి కూడా రీఛార్జ్ చేయించుకోవాలన్నారు.బ్యాలెన్స్ అయిపోతే కరెంట్ ఆగిపోతుందన్నారు. ఈ మీటర్ కు అయ్యే ఖర్చు మన కరెంటు బిల్లుతో పాటు నెలకు 100నుండి 150 రూపాయలు వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారన్నారు.కొద్ది కాలానికి మీటర్లు మళ్ళీ మార్చుకోవాలన్నారు. ఆ భారం జనమే భరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ,వత్తిదారులకు ఇచ్చే రాయితీలు క్రమంగా తొలగిస్తారని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలు ప్రతిఘటించి 13న నిరసన కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు..



రహదారి వద్ద దెబ్బతిన్న కల్వర్టు

ప్రమాదకరంగా కల్వర్టు

పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అల్లూరి సీతారామ రాజు అరకు ఎండపల్లివలస మధ్య మురద గడ్డ వంతెన వద్ద రోడ్డులో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉంది.ఈ రోడ్డ పాడేరు,అరకు ప్రధాన రహదారి కావడంతో నిత్యమూ వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి.ఈ వంతెన వద్ద కల్వర్టు కూలిపోవడం ప్రమాదకరంగా మారింది.వాహనదారులు ఏ మాత్రం ఆదమర్చిన ప్రాణానికే ముప్పు ఏర్పడే పరిస్థితి నెలకొంది.ఇక్కడ ఇటీవల చాల ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.అధికారులు ప్రజాప్రతినిధులు నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు,కానీ ఎవ్వరు కూడా పట్టించుకోకుండా చూస్తూ చూడనట్టు వ్యవహరించడం పై వాహనదారులు మండిపడుతున్నారు.ప్రమాదాల దష్ట్యా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు



కోరుతున్నారు.

కిక్కిరిసిన సీలేరు సంత

- పండగ వారం కావడంతో పోటెత్తిన గిరిజనులు
- అటవీ ఉత్పత్తుల క్రయవిక్రయాలతో సందడి



సీలేరు వారపుసంత

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం నాటి వారపుసంత కిక్కిరిసిపోయింది. భోగి సంక్రాంతి పండుగకు ముందు వచ్చిన వారపుసంత కావడంతో పెద్దసంఖ్యలో గిరిజనులు తరలివచ్చి, పండుగకు కావలసిన సామగ్రిచ నిత్యవసర సరుకులు విరివిగా కొనుగోలు చేశారు. పెద్దసంఖ్యలో ప్రజలు వారపుసంతకు రావడంతో సీలేరు మార్కెట్ సెంటర్ జనసంద్రంగా మారింది.. భోగి సంక్రాంతి పండగల నేపథ్యంలో పూజా సామాగ్రి, కొత్త బట్టలు, పిండి వంటలకు అవసరమైన సామగ్రి అధికంగా కొనుగోలు చేశారు. దుకాణాల వద్ద ఎగబడి వస్తువులను కొనుగోలు చేయడం కనిపించింది.దుప్పిలి వాడ, పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ తదితర ఆంధ్ర ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు ఆటోలు, ఇతర వాహనాలపై అధిక సంఖ్యలో వారపు సంతకు తరలివచ్చారు. మారు మూల గ్రామాల ప్రజలతో పాటు ఎపి జెన్కో ఉద్యో గులు, దినసరి కూలీలు వారపు సంతలో విరివిగా సరుకులు కాయగూరలు కొనుగోలు చేశారు.

దిగొచ్చిన కూరగాయల ధరలు దుప్పలివాడ, పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ తదితర గిరిజన గ్రామాల మాలీలు, రైతులు ఆంధ్రా ఒడిశా గ్రామాలకు చెందిన సరిహద్దు నుంచి వ్యాపారులు వివిధ రకాలు కూరగాయలు తీసుకువచ్చారు. సామాన్యులకు అందుబాటులో ధరలు రావడంతో ప్రజలు విరివిగా కొనుగోలు చేశారు. గత రెండు మూడు వారాలు టమాటా కిలో రూ.50 ఉండగా, స్థానికంగా టమోటా పంట దిగుబడులు ఆశాజన కంగా ఉండడంతో వాటి ధరలు సగానికంటే తక్కువకు పడిపోయింది.

కాలిఫ్లవర్ ధరలదీ అదే పరిస్థితి. ముల్లంగి కట్ట రూ.పదికే విక్రయించిన ప్పటికీ కొనుగోలుకు ప్రజలు పెద్దగా ఆసక్తి కనబడుటలేదు. సంక్రాంతి ముందు వారపు సంత మారుమూల ప్రాంతాల నుంచి గిరిజనులు, మైదాన ప్రాంత వ్యాపారులు పెద్దఎత్తున రావడంతో జాతరను తలపించింది.

150 మందికి ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో రంపచోడవరం సిరిగిందలపాడులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో 150మందికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. 42మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, 10మందికి ఫిజియోథెరపీ, ముగ్గురికి ఇసిజిలు, ఇద్దరికి ఎక్స్‌రేలు చేసినట్లు స్వామీజీ తెలిపారు

32మందికి కంటిపరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించి, 32మందికి కంటి పరీక్షలు చేశారు. ఎనిమిది మందికి కంటిఅద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత మెగా వైద్యశిబిరాలు, కంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో క్యాంప్ కో ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటి బాబు, వాలంటీర్స్ దాసరి పెద్ద అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు, వైద్యశిబిరానికి వచ్చిన రోగులు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలు చదవాలి

- నర్సీపట్నం డిఎస్‌పి మోహన్

ప్రజాశక్తి-గొలుగొండ: యువత ప్రముఖుల జీవిత చరిత్రలు గల పుస్తకాలను అధికంగా చదవాలని నర్సీపట్నం డీఎస్పీ మోహన్ సూచించారు. ఆదివారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయంకు నర్సీపట్నం డిఎస్పీ జి.మోహన్ డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, ఆర్‌ఆర్‌బి, ఏపిపిఎస్సీ గ్రూప్స్ ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు చదువుకునేందుకు 15వేల విలువ స్టడీ మెటీరియల్, రీడింగ్ చైర్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో ఏం జరుగుతుందో తెలియాలంటే ప్రతీ రోజూ దినపత్రికలను చదవాలన్నారు. మంచి అలవాట్లు కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులకు కష్టకలిగించకుండా, ఉపాధ్యాయుల గైడెన్స్‌తో ముందుకు వెళ్లాలన్నారు. సేవా కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల అవగాహన ఉండాలని సూచించారు. ఈ గ్రంథాలయానికి త్వరలో డిజిటల్ లైబ్రరీ, ఇంటర్ నెట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో పండగ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను డీఎస్పీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వై.తారకేశ్వరరావు, ఏ.ఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమును గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులచే బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ నిర్వహించారు. గ్రంథాలయాధికారి రాజుబాబు విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్రను వివరించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో పాములవాక గ్రామంలో పారిశుద్యం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు మండల వైసిపి అధ్యక్షులు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన పంచాయతీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రధాన రహదారి వద్ద బస్సు షెల్టర్ మరమ్మత్తు, అదేవిధంగా తుప్పల తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడంలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

సేంద్రియ ఆహార ఉత్పత్తుల అమ్మకాలు

ప్రజాశక్తి - మాడుగుల: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులను అమ్మకాలు చేపడుతున్నామని సేంద్రియ వ్యవసాయ మండలం ఇంచార్జ్ గండి శ్రీను అన్నారు. ఆదివారం మాడుగుల శ్రీదేవి అమ్మవారి ఆలయం ఎదురుగా గ్రామస్తుల సహకారంతో ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించిన ఆకుకూరలు, కూరగాయలను, దుంప జాతి, పండ్ల జాతి ఉత్పత్తులను, చిరుధాన్యాలను అన్ని రకాల పంటను విత్తనాలను, కషాయాలు అమ్మకాలు చేపట్టారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలతో ప్రజలకు మరింత ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పండించిన ఉత్పత్తుల అమ్మకాలను స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకం చేయడంతో పాటు వాటితో కలిగే ప్రయోజనాలు లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం.టీ దేవి, కొండాజీ, యూనిట్ ఇంచార్జ్ పార్వతి, నాగేశ్వరరావు, సన్యాసిరావు, చిరంజీవి నాయుడు ఐసిఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల:కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత అభివృద్ధి పనులకు గృహ నిర్మాణ అవసరాల నిమిత్తం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక తవ్వకాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ తిరుపల బాబు తెలిపారు.స్థానిక ఎస్సై రమేష్ నీటిపారుదల శాఖ ఇంజనీర్ రాజేష్ తో కలిసి పందూరు, గొట్టివాడ గ్రామాలలో వరాహ నది పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని, వాల్టా చట్టానికి తూట్లు పొడిచే విధంగా తవ్వకాలు చేపట్టరాదన్నారు. వంతెనలు, వాటర్ ట్యాంకుల సమీపంలో తవ్వకాలు చేపట్టరాదని స్థానిక అధికారులకు సూచించినట్లు తెలిపారు. జెసిబి సహాయంతో లోడింగ్ చేయడం, మూడు అడుగులకు మించి తవ్వకాలు చేపట్టడం నిషేధమని తెలిపారు.

పండగ వేళ..పోటెత్తిన పర్యాటకులు



చాపరాయిని సందర్శిస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:సంక్రాంతి పండగ వేళలో కూడా అరుకు పర్యాటక ప్రదేశాలలో అధిక సంఖ్యలో పర్యాటకులతో కిటకిటలాడాయి. మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో చాపరాయి జలపాతం పర్యాటకుల తాకిడితో కిటకిటలాడింది. పర్యాటకులు కుటుంబ సమేతంగా జలపాతంలో సరదాగా స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. ఉద్యానవనంలో కూడా ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు.అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించడంతో చాపరాయి జలపాతం ప్రవేశ గేటులో పర్యాటకుల రద్దీ ఏర్పడింది. వాహనాల రద్దీతో కొంతమేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. జలపాతం నుంచి జైపూర్ జంక్షన్ వరకు రోడ్డు వైపుల వనభోజనాలు చేస్తూ పర్యాటకులు సందడి చేశారు. దీంతోపాటు అంజోడ సిల్క్ ఫారంలో ఉన్న అరకు పినారిలో కూడా అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు.వ్యాపారాలు బాగా జరగడంతో చిరు వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు



థింసా నృత్యం చేస్తున్న పర్యాటకులు

సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

ఎంపీ తనూజా రాణి



మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి

ప్రజాశక్తి- పెదబయలు:మండలంలో సీకరి పంచాయతీకేంద్రంలో మాజీ ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ, అరకు ఎంపి గుమ్మా తనూజారాణి ఆదివారం సందర్శించారు.ఈ సీకరి గ్రామంలో ఎంపీ తనూజ రాణికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గంగ దేవత దేవాలయంని దర్శించుకొన్నారు. దేవాలయానికి వెళ్లే మార్గం ఇరుకుగా ఉండటంతో సీసీ రోడ్డుకు తక్షణమే నిధులు మంజూరు చేస్తామని ఎంపి తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ సీకరి పంచాయతీని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు వసెద్దా జంక్షన్‌లో సింహాద్వారం నిర్మించడానికి నిధులు విడుదల చేస్తానన్నారు. మూడురోజుల పాటు గ్రామంలో జరిగే జాతరకు కావలసిన సదుపాయాలు కల్పిస్తానన్నారు. ఆదర్శ పంచాయతీ గా తీర్చి దిద్దడానికి గ్రామంలో పెద్దలు తోడ్పాటు ఇవ్వాలన్నారు.క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శెట్టి వినయ్, సర్పంచ్ గుల్లెల కృష్ణారావు, వైస్ ఎంపీపీ కొర్ర రా జబాబు, మాజీ సర్పంచ్ సన్యాసి, ఎంపిటిసి ఆనందరావు, నాయకులు ఆనందరావు, ఎస్ బి ఎల్ స్వామి, సన్యాసిదొర, కనకరాజు పాల్గొన్నారు

అసంపూర్తిగా వంటశాల

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంటశాల అసంపూర్తిగా ఉంది. దీంతో, ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వండే భోజన కార్మికులు వంటశాలలు లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నారు. వంటశాలను స్లాబ్ వేసి, ప్లాస్టింగ్ చేసి తలుపులు, కిటికీలు నిర్మించకుండా వదిలేశారు. సుమారు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ పూర్తి చేయకపోవడంతో ఆ పాఠశాల గదుల లోపల మధ్యాహ్న భోజన కార్మికులు వంటలు చేసి విద్యార్థులకు పెడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న వంటశాల భవనాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న వంటశాల భవనం

నేరాలు ఘోరాలు

కోడి పందేల శిబిరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆరిలోవ : సంక్రాంతి నేపథ్యంలో తోటగరువు, బిటిఆర్.నగర్‌లో కోడి పందేలు ఆడుతున్న శిబిరాలపై పోలీసులు ఆదివారం దాడిచేశారు. కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కోడి పుంజులను, రూ.1500 స్వాధీనం చేసుకున్నారు. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 పందెం కోళ్లు స్వాధీనం

గాజువాక : జివిఎంసి 70వ వార్డు పరిధి ఎల్‌బి.నగర్‌లో కోడి పందేలకు సిద్ధమౌతున్న ఇద్దరిని గాజువాక సిఐ పార్థసారథి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 పందెం కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. గాజువాక పరిధిలో కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : మండలంలోని మూలకుద్దు గ్రామంలో ఉప్పుటేరు పక్కన బహిరంగ ప్రదేశంలో ఆదివారం కోడి పందేలు ఆడుతున్న 8 మందిని స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు.కోడి పందాలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. వారి నుంచి కత్తులు కట్టి ఉన్న 6 కోళ్లు, రూ.12,600 స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సిఐ సుధాకర్, ఎస్ఐ జి.హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని అనంతవరం గ్రామంలో సారిక పైడిరాజు ఇంటి వెనుక ఖాళీ ప్రదేశంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3700, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పద్మనాభం సీఐ శ్రీధర్ తెలిపారు.

ఆనందపురం : ఆనందపురం పంచాయతీ పరిధిలో విల్లాస్ ఎదురుగా ఉన్న బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.9 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సిహెచ్ వాసునాయుడు, ఎస్ఐ సంతోష్ తెలిపారు.

ట్రావెల్ బస్సు ఢీకొని చిన్నారికి గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ నుంచే విజయవాడకు వెళుతున్న ట్రావెల్ బస్సు పాత గాజుల జంక్షన్‌లో ఒక ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఆ సమయంలో బండిపై ఉన్న చిన్న పాపకు స్వల్ప గాయమైంది. అదే సమయంలో గాజువాక మీదుగా వెళుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత కాన్వాయ్ ఆపి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి

- ముగ్గురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- ఎస్.రాయవరం :మండలంలో రెండు బైక్ లు ఢీ కొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా, ముగ్గురు యువకులు తీవ్రగాయాల పాలయినట్లు స్థానిక ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఆదివారం ఆయన ఇచ్చిన సమాచారం మేరకు.. శనివారం రాత్రి పదిన్నర గంటల సమయంలో అడ్డురోడ్డు నుండి రేవుపోలవరానికి యువకులు బైక్‌పై వెళుతున్నారు. కొరుప్రోలు పీచు పరిశ్రమ వద్దకు వచ్చేసరికి బైక్‌లు ఢీ కున్నాయన్నారు. ఈ ఘటనలో కొత్తరేవుపోలవరం గ్రామానికి చెందిన పల్లేటి జగదీష్ (20) ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. హర్షిత్ కుమార్, ఎరిపల్లి వాసు తీవ్ర గాయాలపాలయ్యారు. మరొక యువకుడు ఇశ్రాయెల్ స్వల్ప గాయాలతో బయట పడినట్లు తెలిపారు. క్షతగాత్రులను 108లో నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో హర్షిత్ కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ లో ప్రయివేటు ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టమ్ అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. మతుడు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

25 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని పేరంటాల పాలెం గ్రామానికి చెందిన గోనె సంచెలో అక్రమంగా నిల్వ ఉంచిన 25మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు తనిఖీ చేయగా, పువ్వుల ప్రసాదరావు వద్ద మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



విఆర్ఎస్ ప్రకటన ప్రతులను భోగి మంటలో వేస్తున్న లోకనాథం తదితరులు

ఉక్కులో విఆర్ఎస్‌పై భగ్గు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాన్ని (విఆర్ఎస్) ముందుకుతెచ్చి కర్మాగారంలోని ఉద్యోగులను తొలగించే చర్యలను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన విశాఖ నగరంలో సంబంధిత ఆర్డర్ ప్రతులను ఆదివారం భోగి మంటల్లో వేసి దహనం చేశారు. తక్షణమే విఆర్ఎస్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి - గాజువాక : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో విఆర్ఎస్‌ను ముందుకు తేవడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం గాజువాక జగ్గు జంక్షన్‌లో భోగి మంటలో విఆర్ఎస్ ప్రకటన ప్రతులను వేసి తగులబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న విశాఖలో జరిగిన సభలో మోడీ, చంద్రబాబు, పవన్‌లు ఉక్కు విషయంపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చూడటం అన్యాయమన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించకుండా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పాటు చేస్తామంటున్న ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని సిఎం చంద్రబాబు మోడీని కోరడం శోచనీయమన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ ఉక్కుపై స్పందించకపోవడం సరికాదన్నారు. చంద్రబాబు తాను మారానని అంటున్నారు తప్ప వాస్తవానికి ఆయన ఏమీ మారలేదన్నారు. మోడీకి దాసోహమవుతూ గ్రామీణ ప్రాంతాల్లో టోల్‌గేట్లు ఏర్పాటు చేసి ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తున్నారన్నారు. పార్టీ గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో ఇక్కడి ప్రజలు గెలిపిస్తే ఆయన స్టీల్‌ప్లాంట్‌పై అస్సలు నోరు మెదపడం లేదన్నారు. ప్రజల ఆకాంక్షలను గుర్తెరిగి ప్లాంట్ పరిరక్షణ విషయమై కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాస్, స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, నాయకులు పివైవి.రమణరావు, అప్పారావు, జి.లక్ష్మి, సరోజిని, వైటి.దాస్, నారాయణ, శ్రీనివాస్, గురప్ప, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మరోసారి ప్రధాని మోడీ ద్రోహం చేస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకరించి ముగ్గురు మోసగాళ్ళుగా చరిత్రలో నిలిచిపోయారని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు మండిపడ్డారు. ఆ ముగ్గురి వైఖరిని ఖండిస్తూ మద్దిలపాలెం కళాభారతి రోడ్డులో సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. మూడు కోతులతో కూడిన మోడీ, బాబు, పవన్ పోస్టర్లను చేబూని ఉక్కు విఆర్ఎస్ ప్రకటన ప్రతులను భోగి మంటలో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ ఇటీవల విశాఖకు వచ్చిన మోడీ స్టీల్‌ప్లాంట్ కోసం ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. పైగా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కావాల్సిన ఇనుప ఖనిజాన్ని పైపులైన్ ద్వారా అందించడానికి సహకరిస్తామని చెప్పుకొచ్చారన్నారు. దానికి వెంటనే బాబు, పవన్‌లు ధన్యవాదాలు తెలియజేయడం దుర్మార్గమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయడానికే మిట్టల్ స్టీల్ వస్తోందన్నారు. ప్రస్తుతం ఉక్కు కర్మాగారంలో ఉన్న ఉద్యోగులను, కార్మికులను బలవంతంగా తొలగించేందుకు ప్లాంట్ యాజమాన్యం బహిరంగంగానే చర్యలు తీసుకుంటున్నా బాబు, పవన్‌లు ఏమాత్రం మాట్లాడటం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, జోన్ నాయకులు పి.వెంకటరావు, కుమారి, కుమార్ మంగళం, త్రినాధ్, జివిఎన్.చలపతి, జివి.రమణ, అనపర్తి అప్పారావు, పీతల అప్పారావు పాల్గొన్నారు.

కోడి పందేలకు బరులు సిద్ధం

సోషల్ మీడియా వేదికగా ఆహ్వానం పలుకుతున్న నిర్వాహకులు

పోటీ పడి బరులు ఏర్పాటు చేస్తున్న కూటమి నేతలు? - తమకేమీ తెలియదంటున్న పోలీసులు

ప్రజాశక్తి - ఎటపాక : గతంలో ఎన్నడూ లేనివిధంగా మండలంలో కోడిపందేల నిర్వహణ అనే కొత్త సంస్కృతికి తెరలేచింది. నేరుగా కాకుండా సోషల్‌మీడియా ద్వారా చడీచప్పుడు లేకుండా ప్రచారం చేస్తూ మండలంలో పలుచోట్ల కోడిపందేలకు రంగం సిద్ధం చేస్తున్నారు. కోడి పందేల బరుల ఏర్పాట్లలో అధికార కూటమి నేతలు పోటీలు పడి ఏర్పాట్లు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి పోలీసుల వద్ద నుండి అనుమతులు తెచ్చుకున్నామని నిర్వాహకులు బాహాటంగానే చెబుతుండగా, పోలీసులు మాత్రం తమకేం సమాచారం లేదంటూ తేల్చేసారు. కూటమి నాయకులు కొందరు సోషల్ మీడియాలో బరులు ఏర్పాటు చేసే ఫోటోలను, లొకేషన్ షేర్ చేయడం పట్ల విశేషం. దీనిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, అనుమతులు లేకుండా ఇంత బహిరంగంగా కోడి పందాలు ఎలా నిర్వహిస్తారనిప్రశ్నిస్తున్నారు. పోలీసులతో లోపాయికారి ఒప్పందం జరిగి ఉండవచ్చని అభిప్రాయ పడుతున్నారు. కోడి పందేలతో పాటు గుండాట, మూడు ముక్కల తదితర జూదాటలతో సర్వం సిద్ధం కావడంతో దీనిపై విమర్శలు వస్తున్నాయి. దీన్నిలాగే వదిలేస్తే, కోడిపందేలు, జూదం విచ్చలవిడిగా మారి అన్ని గ్రామాలకు పాకిపోతుందనే విమర్శలు వినిపిసున్నాయి. నియంత్రణకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కోడి పందేలు వద్దు.. సంప్రదాయ క్రీడలే ముద్దు

ప్రజాశక్తి- విఆర్.పురం: తెలుగు వారి సనాతన మకర సంక్రాంతిని పురస్కరించుకొని పల్లెల్లో సంప్రదాయ ఆటలు నిర్వహించుకోవాలని, కోడి పందేలు, గుండాట, లాటరీలు వంటి జూదక్రీడలు వద్దు అంటూ ఆదివారం విఆర్.పురంలోని రేఖపల్లి జంక్షన్ వద్ద పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగహన కల్పించారు. పండుగ సంస్కృతి ఉట్టి పడేలా ముగ్గులు, వాలీబాల్, కబడ్డీ,క్రికెట్ వంటి క్రీడలు నిర్వహించి యువతతో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని నలుదిశలా చాటాలని పోలీస్‌శాఖ యువతకు పిలుపునిచ్చారు. క్రీడలతో శరీర ధారుడ్యం పెరుగుదల, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కోడి పందేలు జూదం వైపు వెళ్లకుండా యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. రేఖపల్లిలో జరిగిన కార్యక్రమంలో విఆర్ పురం ఎస్ఐలు ఎం సంతోష్‌కుమార్, టి సత్యనారాయణ , పోలీస్ సిబ్బంది ప్రజలు యువత పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బస్సుల కొరత లేదు

- విశాఖ నుంచి దూర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు

- సంక్రాంతికి అదనంగా 350 బస్సులు వేస్తున్నాం

- 'ప్రజాశక్తి'తో జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సంక్రాంతిని పురస్కరించుకుని విశాఖపట్నం ద్వారకా బస్ స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు ఇప్పటికే 7 డిపోల పరిధిలో ఉన్న 680 బస్సులు కాకుండా మరో 350 ప్రత్యేక బస్సులను ప్రయాణికుల కోసం నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు వెల్లడించారు. ఈ ఏడాది బస్సుల కొరత, ఛార్జీల పెంపు లేదన్నారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలను ముచ్చటించారు.


ఎప్పటి నుంచి అదనపు సర్వీసులు నడుపుతున్నారు ?

పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జనవరి 9 నుంచి 13వ తేదీ వరకూ ప్రత్యేకంగా 350 బస్ సర్వీసులను విశాఖ డిబిఎస్ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలు, సుదూర ప్రాంతాలైన విజయవాడ, ఉభయ గోదావరి జిల్లాలు, హైదరాబాద్ వరకూ నడుపుతున్నాం. 13 తర్వాత రద్దీ కొంత తగ్గిపోతుంది. ఎవరి ఊళ్లకు వారు వెళ్లిపోయాక బస్ సర్వీసులు కొంత మేరకు తగ్గించేస్తాం. మరలా 16 నుంచి రిటర్న్ ట్రాఫిక్ మొదల వుతుంది. మరో నాలుగైదు రోజుల పాటు సర్వీసులు మరలా పెంచుతాం.

రాష్ట్రంలోనే అత్యధిక బస్ సర్వీసులు విశాఖ నుంచే ఎందుకు ?

విశాఖలో అత్యధిక మంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి సెటిలర్స్‌గా జీవనం సాగిస్తున్నారు. అనేక రంగాల్లో ఇక్కడకొచ్చి స్థిరపడిన వారుండడంతో పండగల సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లడం, రావడంతో ట్రాఫిక్ అధికం. పైగా రైళ్లకు సంబంధించి పాసింజర్‌లు చాలా రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల సంఖ్య అవసరం ఏర్పడింది.





ఏయే ప్రాంతాలకు ఎన్నెన్ని సర్వీసులు వెళ్తున్నాయి?

విశాఖ నుంచి హైదరాబాద్‌కు 25 ప్రత్యేక బస్సులు, విజయవాడకు 45, రాజమండ్రికి 30, అమలాపురం, కాకినాడలకు 30, అలాగే విశాఖ నుంచి విజయనగరం, పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం వరకూ సుమారు 205 బస్సులు, మచిలీపట్నంకు 2 బస్సులు నడుపుతున్నాం.



వాలీబాల్ కిట్ అందజేస్తున్న విజయ భాస్కర్

యువతకు వాలీబాల్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి:సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువతను ప్రోత్సహించేందుకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష భర్త, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్ ఆదివారం కింద్ర యువకులకు వాలీబాల్ కిట్‌లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ. సంక్రాంతి పండుగను యువత ఆనందోత్సవాల నడుమ జరుపుకోవాలని సాంప్రదాయ ఆటల పోటీల్లో పాల్గొవాలని సూచించారు. కింద్ర గ్రామంలో ప్రతి ఏటా నిర్వహించే సాంప్రదాయ క్రీడలైన వాలీబాల్, కబడ్డీ,ముగ్గుల పోటీల ఏర్పాట్లను పర్యవేక్షించారు గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కె శివ,ఎస్ సుబ్బారావు, యువకులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సంక్రాంతి సాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతిని పురస్కరించుకొని 'చారిటీ బాక్స్' సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు నిత్యావసరాలు అందజేశారు. విశాఖ ఓల్డ్ సిటీ పాత పోస్టాఫీసు దగ్గర నివాసం ఉంటున్న పేదలకు, ఎంవిపి కాలనీ, పెదవాల్తేరు, తాటిచెట్లపాలెం, శివాజీపాలెం తదితర ప్రాంతాలలో ఎంపిక చేసిన నిరాశ్రయులకు నిత్యావసరాలు అందజేశారు. ఒక్కో కిట్‌లో 15 రకాల వస్తువులు, 15 కేజీల సామగ్రి ఉంది. ఈ సందర్భంగా చారిటీ బాక్స్ ప్రతినిధి పొట్నూరు వెంకట రమణ మాట్లాడుతూ తెలుగు లోగిళ్లలో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎంతో ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. పేద, ధనిక తేడా లేకుండా పండగ మూడు రోజులు అందరూ సంతోషంగా గడుపుతారని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అత్యంత దయనీయంగా జీవనం గడుపుతున్న కుటుంబాలను ఎంపిక చేసి ఈ నిత్యావసరాలు అందజేశామన్నారు. కేవలం విశాఖ నగరంలోనే కాకుండా, అనకాపల్లి జిల్లా యలమంచిలి, పాయకరావుపేట, అలాగే శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేట, చాపర, బాపట్ల జిల్లాలోని మార్టూరు ప్రాంతాల్లో కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో ఇదే రోజు వితరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. చారిటీ బాక్స్ ప్రతినిధులు తాడికొండ కరుణాకర్, కొంతం శివాజీ ప్రసాద్ మాట్లాడుతూ చారిటీ బాక్స్ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు నిరుపేదల పక్షానే నిలిచిందన్నారు. కార్యక్రమంలో లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.

జివిఎంసిని సందర్శించిన ట్రైనీ ఐఎఎస్‌లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని 42 మంది ట్రైనీ ఐఎఎస్ అధికారులు ఆదివారం సందర్శించారు. అక్కడి అధికారులు విశాఖ నగరంలోని జోన్లు, వార్డులు, ఇతర ఇంజినీరింగ్ పనుల టెండర్ల ప్రక్రియ, 15వ ఆర్థిక సంఘం నిధులు, అభివృద్ధి పనులు, థీం పార్కులు, జంక్షన్లు, నగరంలో విద్యుత్ ఆదాకు చేపట్టిన సోలార్ పవర్ ప్రాజెక్టు వివరాలను వారికి తెలియజేశారు. కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి పి.శివ ప్రసాదరాజు, డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరిహారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టికెట్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన బాధితురాలు గుడ్ల రజిని కుటుంబ సభ్యులకు ఆదివారం ఉదయం మద్దిలపాలెంలోని ఆమె గృహంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, టిటిడి సభ్యులు ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున హోం మంత్రి రూ.25 లక్షల చెక్కు అందజేయగా, టిటిడి తరపున బోర్డు సభ్యులు రూ.2.5 లక్షల చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ మృతుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు